రేపు రన్ 4 రీసెర్చ్

బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో రన్ 4 రీసెర్చ్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని వాజపేయి స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సనీశ్ డేవిష్ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల మధ్య 3, 5, 10 కిలోమీటర్ల విభాగంలో పరుగు పోటీలు ఉంటాయన్నారు. సమాజంలో క్లినికల్ పరిశోధనలకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచాలనే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నగరంలోని అన్ని ప్రాంతాలనుంచి భాగస్వామ్యులయ్యేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

మూగబోయిన ఎమ్మెహట్టి



- ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో
- 13 మంది దుర్మరణం
- మూడు కుటుంబాల్లో తీరని విషాదం
- రూ.2 లక్షలు పరిహారం ప్రకటించిన సీఎం

కొత్త వాహనం కొనుగోలు చేసిన ఆనందం కొన్ని రోజులైనా లేకుండా పోయింది.. జీవనోపాధి కోసం తెచ్చుకున్న వాహనం జీవితాలనే బుగ్గిచేసింది. తెల్లవారుజామున ప్రయాణం.. అతివేగం.. రోడ్డుపై నిలబెట్టిన లారీ.. వెరసి మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. హావేరి జిల్లా బ్యాడగి తాలూకా గుండేనహళ్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెలర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో 13 మంది మృతి చెందారు. మృతులంతా శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా హొళెహొన్నూరు ఎమ్మెహట్టి గ్రామంలోని మూడు కుటుంబాలకు చెందినవారు. వారి మృతితో ఎమ్మెహట్టి మూగబోయింది. ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. బంధువుల ఆర్తనాదాలతో గ్రామం తల్లడిల్లిపోయింది.



ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో ట్రావెలర్ వాహనం





దేవుడి దర్శనానికి బయల్దేరే ముందు వాహనానికి పూజలు చేస్తున్న మహిళ (ఫైల్)



ఎమ్మెహట్టి గ్రామంలోని ఆదర్శ్ ఇల్లు

బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఓ వాహనం కొన్నారు. ఇకపై తమ పల్లెతోపాటు సమీపాన ప్రజల సరదాలు, శుభకార్యాలు, విహార యాత్రలకు వెళ్లాలంటే వాహనం ద్వారా సౌలభ్యం కల్పిద్దామని భావించారు. రెండు వారాల క్రితం కొనుగోలు చేసిన టెంపో ట్రావెలర్ వాహనం ముందుగా అద్దెకు ఇవ్వకుండా కుటుంబ సభ్యులతో కలసి గుడికి వెళ్లొద్దామని భావించారు. వాహనం కొన్నప్పటి నుంచి ఆదర్శ్‌లో ఉత్సాహం పెరిగింది. ఇంటిల్లిపాదితోపాటు సమీప బంధువులు మూడు కుటుంబాలతో కలసి వెళ్లారు. గురువారం మహారాష్ట్రలోని తుళజాపుర ప్రాంతంలోని పలు ఆలయాలను సందర్శించారు. సవదత్తి ఆలయాన్ని కూడా సందర్శించారు. ఆరేడేళ్లుగా డ్రైవర్‌గా అనుభవం ఉన్న ఆదర్శ్ సొంత వాహనంతో కుటుంబీకులతో కలసి స్వగ్రామమైన భద్రావతి తాలూకా ఎమ్మెహట్టికి వెనుతిరిగారు. మరి కొన్ని గంటల్లో స్వగ్రామానికి చేరుకుని బంధువులు, గ్రామస్తులతో సరదాగా గడపాలని భావించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని గమనించకుండా అంతేవేగంతో దూసుకెళ్లడంతో క్షణాల వ్యవధిలో అనుకోని దుర్ఘటన చోటు చేసుకుంది. హావేరి జిల్లా 48వ జాతీయ రహదారిపై బ్యాడగి తాలూకా గుండేనహళ్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున సుమారు 4 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెలర్ వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. వాహనంలో 17 మంది ప్రయాణిస్తుండగా 11 మంది దుర్మరణం చెందగా.. మరో ఇద్దరు ఆసుపత్రిలో కన్నుమూశారు. మృతులంతా శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా హొళెహొన్నూరు ఎమ్మిగట్టి గ్రామంలోని మూడు కుటుంబాలకు చెందినవారు. ఏమి జరిగిందో తెలుసుకోలేని పరిస్థితి నెలకొంది. భయంకర శబ్దానికి అదేమార్గంలో వెళ్లే వాహనదారులు గుర్తించడంతోనే ప్రమాదం బయటపడింది. ఎమ్మెహట్టిలో 300కు పైగా మరాఠా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడి వారంతా సమీప బంధువులే. నాగేశ్వరరావు భద్రావతి తాలూకా డీబీహళ్లిలో జలవనరులశాఖలో పని చేస్తున్నారు. ఆయన భార్య విశాలాక్షి ఆశా కార్యకర్త. కుమారుడు ఆదర్శ్ డ్రైవర్‌గా కొనసాగుతున్నారు. ఆ కుటుంబానికి ఎటువంటి ఆస్తి లేదు. కుమారుడు ఆరేళ్లపాటు ఇతరులతో డ్రైవర్‌గా పనిచేసి సొంతంగా వాహనం కొనుగోలు చేయడంతో బెళగావి జిల్లా చించోళిలోని మాయమ్మ ఆలయానికి వెళ్లారు. నాగేశ్వరరావుకు తమ్ముడి వరుస అయ్యే శరణప్ప, పరశురాం, పుణ్యవతి కుటుంబాలకు చెందిన 17మంది వాహనంలో సోమవారం రాత్రి బయల్దేరారు. ప్రమాదంలో పరశురామ్ (45), భాగ్య (40), నాగేశ్ (50), విశాలాక్షి (50), సుభద్ర బాయి (65), పుణ్య (50), మంజుళ బాయి (57), డ్రైవర్ ఆదర్శ (23), మానస (24), రూప (40), మంజుళ (50), ఆర్య (4), నందన్ (6) మృతి చెందారు. ఇలా ఎమ్మెహట్టి గ్రామం మూగబోయింది. ప్రమాదం విషయం తెలియగానే అబ్కారిశాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సీఎం సిద్దరామయ్య ఢిల్లీ నుంచే జిల్లా అధికారులతో చర్చలు జరిపి విషాదం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి 'ఎక్స్' ద్వారా సంతాపం తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం స్వగ్రామానికి తరలించారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారిణి మానస



ఆసుపత్రి వద్ద గుమిగూడిన బంధువులు



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న సీఎం, డీసీఎం, మంత్రులు

ఢిల్లీలో సీఎం బిజీ.. బిజీ

బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఢిల్లీలో శుక్రవారం బిజీబిజీగా గడిపారు. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరితో భేటీ అయ్యారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధికి సంబంధించి చర్చలు జరిపారు. ఇంకా పలువురు మంత్రులు, అధికారులను కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ అయ్యారు. తెలంగాణ మంత్రి శ్రీధరబాబు, మధుయాష్కిగౌడతోపాటు సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు తదితరులు ఉన్నారు.



సీఎం సిద్దరామయ్యతో తెలంగాణ డీసీఎం భట్టి విక్రమార్క

గ్రూపులకు ఆజ్యం

- తెరపైకి ముఖ్యమంత్రి మార్పు అంశం
- డీసీఎం పదవులపైనా ఆగని రచ్చ
- సిద్దూ, డీకే వర్గాలుగా విడిపోయి వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్‌లో అప్పుడప్పుడు ఉపద్రవాలు తెరపైకి వస్తుంటాయి. అందుకు పలు కారణాలు ఉన్నాయి. పార్టీలో వాక్ స్వాతంత్ర్యం అన్ని స్థాయిల్లో ఉండడం, పైగా అధికారం ఉంటేనే హవా ఉంటుందని తమ గ్రూపుకోసం చేసే ప్రయత్నాలే తగాదాలకు కారణమవుతుంటాయి. గతంలో సిద్దరామయ్య ఐదేళ్లపాలనలో ఎన్నోసార్లు నాయకత్వ మార్పు ప్రస్తావన వచ్చింది. దళిత, లింగాయత, ఒక్కలిగ సామాజికవర్గాలకు సీఎం పదవి కావాలనే ప్రయత్నాలు చేశారు. బెంగళూరుకు పరిమితం కాకుండా ఢిల్లీలోనూ తమ వాణి వినిపించారు. అధిష్టానం వాయిదాలు వేయడం, పలు సందర్భాల్లో ససేమిరా అంటూ తెగేసి చెప్పడంతో వెనకడుగు వేయాల్సి వచ్చింది. ఎన్నో విధాల అవకాశాలు కలసి రావడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తొలుత సీఎం ఎవరు కావాలనే అంశం వారం రోజుల ఉత్కంఠ సాగింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందే డీసీఎం పదవులు కీలక కులాలకు ఇవ్వాలనే అంశం తెరపైకి తెచ్చారు. అప్పట్లో ఎన్నికలు ముగిసేదాకా ఎవరూ మాట్లాడరాదంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హెచ్చరించడంతో మౌనం పాటించారు. ఎన్నికలు ముగియడంతో ప్రస్తుతం మరోసారి డీసీఎంల ప్రస్తావనతో వారం రోజులుగా హల్‌చల్ చేస్తోంది. రాష్ట్ర పార్టీలో నాలుగు గ్రూప్‌లు ఉన్నాయి. ఇందులో సీఎం సిద్దరామయ్య గ్రూప్ కీలకంగా ఉంది. ఆయన టీమ్‌లో ఉండే మంత్రుల్లో కేఎం రాజణ్ణ, సతీశ్‌జార్కిహొళి, జమీర్ అహ్మద్‌ఖాన్, ఆర్‌బీ తిమ్మాపుర, కేజే జార్జ్, దినేశ్ గుండూరావు, భైరతి సురేశ్, వెంకటేశ్ ముద్ర పడినవారు. ఇక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మద్దతుదారులలో మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, మధుబంగారప్ప, డి.సుధాకర్, మంకాళ్ వైద్య, ఎంసీ సుధాకర్ ఉన్నారు.



తటస్థ గ్రూప్‌లో కృష్ణబైరేగౌడ, ఈశ్వర్‌ఖండ్రె, సంతోష్‌లాడ్, హెచ్‌కె పాటిల్ ఉన్నా పరోక్షంగా సిద్దరామయ్యకు మద్దతు ఇస్తారు. రామలింగారెడ్డి తటస్థంగా ఉన్నా పరోక్షంగా డీకే శివకుమార్‌వైపు ఉంటారు. పూర్తి తటస్థంగా ఉండేవారిలో ఎస్ఎస్ మల్లికార్జున, శివానందపాటిల్, రహీంఖాన్, శివరాజ్ తంగడగి, శరణబసప్ప దర్శనాపూర్ ఉన్నారు. పూర్తిగా అధిష్టానం వైపు ఉన్నవారిలో కేహెచ్ మునియప్ప, డాక్టర్ పరమేశ్వర్, ప్రియాంక ఖర్గే, శరణుప్రకాశ్ పాటిల్ ఉన్నారు. వీరిలో ఎవరికివారు తమ అనుకూలం కోసం ఆరోపణలు చేస్తుంటారు. సిద్దరామయ్యకు ఎక్కువమంది మద్దతు ఇవ్వడం వెనుక సీనియర్ నేతగాను, అందరిని కలుపుకుపోయే సామర్థ్యం కల్గినవారని, పైగా సంక్షేమాలతోపాటు ప్రత్యర్థులను దీటుగా విమర్శించడంలో సమర్థులనే అభిప్రాయం ఉండడమే కారణం. కొన్ని సందర్భాల్లో బీజేపీ, జేడీఎస్‌కు చెందినవారు సైతం సిద్దరామయ్య పట్ల విమర్శలు చేసే సందర్భంలో ఆచితూచి వ్యవహరిస్తారు.



డీకే శివకుమార్ పార్టీ సీనియర్ నేతలు సతీశ్‌జార్కిహొళి, ఎంబీ పాటిల్, కేఎన్ రాజణ్ణతో అసంతృప్తిగా వ్యవహరించడం, బహిరంగంగా విమర్శలు చేయడం వంటివి మైనస్‌గా ఉన్నాయి. కాంగ్రెస్‌లో గ్రూప్‌లు ఉన్నాయని మంత్రి రాజణ్ణ బహిరంగంగానే అభిప్రాయపడ్డారు. తాను సిద్దరామయ్య గ్రూప్ కాదని అయినా ఎవరైనా అనుకుంటే అభ్యంతరం లేదన్నారు. అధిష్టానం నిర్ణయాలన్నీ పాటిస్తున్నామని అన్నారు. డీసీఎంల వివాదం కొనసాగుతుండగానే కేపీసీసీ అధ్యక్ష పదవి పైనా రాజణ్ణ వ్యాఖ్యలు చేయడం మరోసారి చర్చనీయాంశమైంది. ఇలా గ్రూపు విభేదాలు తరచూ గుప్పుమంటున్నాయి.

బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి

- వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతికి సీఎందే బాధ్యత
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర
- సీబీఐ విచారణకు డిమాండ్



చిత్రదుర్గ నిరసనలో ప్లకార్డులతో విజయేంద్ర, కార్యకర్తలు, బళ్లారిలో ర్యాలీగా వెళుతున్న మాజీమంత్రి శ్రీరాములు


బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 187 కోట్ల అవినీతిపై నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర డిమాండ్ చేశారు. చిత్రదుర్గలో కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇదో భారీ అవినీతి అన్నారు. కోట్లాది రూపాయలు లూటీ చేసి హైదరాబాద్‌లోని కొన్ని బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడం వెనుక కుట్ర ఉందన్నారు. అవినీతిపై సీబీఐ దర్యాప్తు జరిపితే అసలు సూత్రధారులు బయటకు వస్తారని పేర్కొన్నారు. మంత్రి నాగేంద్ర బంధువు, సిరుగుప్ప నుంచి పోటీ చేసిన మురళి పాత్ర ఇందులో కీలకమన్నారు. కార్పొరేషన్ పనుల లోనూ నెక్కుంటి నాగరాజ్ కీలక భూమిక పోషించారని ఆరోపించారు. నెక్కుంటి నాగరాజ్ మామకు అర్హత లేకున్నా హాస్టళ్లకు ఆహార పదార్థాల సరఫరా టెండరు కట్టబెట్టారని తెలిపారు. అవినీతి పనుల రక్షణకు ప్రభుత్వం నిలుస్తోందని ఇప్పటివరకు 11మంది అరెస్టు కాగా రూ.14.07 కోట్లు మాత్రమే జప్తు చేశారని, మిగిలిన సొమ్ము ఏమైనట్టు అని ప్రశ్నించారు. కోలారులో జరిగిన ఆందోళనలో ప్రతిపక్షనేత అశోక్ పాల్గొన్నారన్నారు. బళ్లారిలో బీజేపీ నాయకులు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి బి. శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్‌నాయుడు నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. డీసీ కార్యాలయానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. అనంతరం అక్కడ బైఠాయించారు. ఆదేవిధంగా జిల్లాలవారీగా కలెక్టరేట్లను బీజేపీ నాయకులు ముట్టడించారు.



కోలారు కలెక్టరేట్ ముట్టడిలో ప్రతిపక్షనేత అశోక్



తిరుమల ఘాట్ రోడ్డులో ఏనుగుల కలకలం



తిరుమల ఘాట్‌లో రోడ్డు సమీపానికి వచ్చిన ఏనుగుల గుంపు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. రోడ్డుకు అతి సమీపానికి ఏనుగులు రావడం కలకలం సృష్టించింది. మార్గంలోని ఏడవ మైలు వద్ద సుమారు ఏడు ఏనుగుల గుంపు రోడ్డు సమీపానికి వచ్చింది. చెట్లను విరుస్తూ ఘీంకారాలతో హల్‌చల్ చేయడం గమనించిన యాత్రికులు బెంబేలెత్తిపోయారు. తమకు ఏమైనా హాని కలిగిస్తాయోమోననే భయంతో వాహనాలు ఆపేశారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు ఆగిపోయాయి. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ విభాగాల అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయేలా శబ్దాలు చేశారు. 20 నిమిషాల తర్వాత ఏనుగులు అడవిలోకి వెళ్లిపోవడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఏటా ఇదే సమయానికి ఏనుగుల గుంపు నీటిని వెతుక్కునే క్రమంలో రోడ్డు సమీపానికి వస్తుంటాయని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటు వాహనదారులను కూడా అప్రమత్తం చేస్తామన్నారు.

ఎట్టకేలకు చిక్కిన చిరుతపులి

మహిళను చంపిన చిరుతగా ప్రాథమిక అంచనా

తిరుపతి జూకు తరలించిన అటవీశాఖ అధికారులు



శిరివెళ్ల, జూన్ 28: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన బోనుకు ఓ చిరుత పులి చిక్కింది. . కట్టెల కోసం అడవిలోకి వెళ్లిన పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నీసాపై ఈ నెల 25న చిరుతపులి దాడిచేసి హతమార్చిన విషయం తెలిసిందే. చిరుత తరచూ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండడంతో దాన్ని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు పలు చోట్ల బోన్లు, ట్రాప్ కెమెరాలను అమర్చారు. ఎట్టకేలకు పచ్చర్ల చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటు చేసిన బోనులో శుక్రవారం తెల్లవారుజామున ఓ చిరుత పులి చిక్కింది. ప్రస్తుతం బోనులో చిక్కిన చిరుత పులి.. మహిళపై దాడి చేసిన చిరుతగా అటవీశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసు కలిగిన ఈ చిరుతను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌కు తరలించినట్టు ఎఫ్ఆర్‌వో ఈశ్వరయ్య వెల్లడించారు.



గోపికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇన్‌సెట్లో దాసరి గోపికృష్ణ

స్వగ్రామానికి గోపికృష్ణ మృతదేహం

- పాడె మోసిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ, తహసీల్దార్ నిర్మలానందబాబా
- గోపికృష్ణ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించిన ముఖ్యమంత్రి

కర్లపాలెం, జూన్ 28: అమెరికాలో జరిగిన తుపాకీ కాల్పుల్లో మృతి చెందిన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలికి చెందిన దాసరి గోపికృష్ణ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులు, భార్య, బంధువులు వారం రోజులపాటు మృతదేహం కోసం క్షణమొక యుగంగా నిరీక్షించారు. మృతదేహం ఇంటికి చేరుకునే సరికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గోపికృష్ణ ఇంటికి చేరారు. అతని తల్లిదండ్రులు ధనలక్ష్మి, శ్రీనివాసరావు, భార్య ప్రవల్లికను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఓదార్చారు. గోపీకృష్ణ మృతదేహానికి నరేంద్రవర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దార్ నిర్మలానందబాబాతో కలిసి పాడె మోశారు. కాగా.. అమెరికా నుంచి స్వగ్రామానికి మృతదేహం చేరుకోవడానికి అవసరమైన ఏర్పాట్లను ఎమ్మెల్యే నరేంద్రవర్మ.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గోపికృష్ణ భార్యకు ప్రభుత్వం తరఫున ఉద్యోగం ఇప్పిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారని నరేంద్రవర్మ తెలిపారు.

అప్పుల ఒత్తిడితో రైతు ఆత్మహత్య

నార్పల, జూన్ 27: అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని చైతన్య కాలనీకి చెందిన రైతు చాకలి నాగప్ప(46) అప్పుల ఒత్తిడి భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాగప్పకు 1.30 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంతో పాటు వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం సుమారు రూ.14 లక్షలు అప్పు చేశాడు. ఇందులో రూ.9 లక్షలు అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తీసుకున్నాడు. రుణం చెల్లించకపోవడంతో వారు నోటీసులు జారీ చేశారు. అప్పు ఇచ్చిన ఇతరుల నుంచి సైతం ఒత్తిడి మొదలైంది. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మదర్సాలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

- తమ కుమార్తెను చంపేశారని తల్లిదండ్రుల ఆరోపణ
- విజయవాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన
- ఫుడ్ పాయిజన్ జరిగిందంటున్న నిర్వాహకులు
- అధికారుల తనిఖీల్లో 100 కిలోల కుళ్లిన మాంసం గుర్తింపు



కరిష్మా

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో ఉన్న మదర్సాలో ఓ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఫుడ్ పాయిజన్ కావడం వల్లే ఆమె చనిపోయిందని నిర్వాహకులు చెబుతున్నారు. ఎంకే బేగ్ స్కూల్ వద్ద నిస్వాన్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సయ్యద్ షాహిద్ పర్వీజ్ అనే వ్యక్తి జామియా హైదయాతుల్ వనాద్ మదర్సాను నిర్వహిస్తున్నాడు. ఖమ్మం, గుంటూరు, ఏలూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 60 మంది విద్యార్థినులు ఇక్కడ ఉంటున్నారు. ఈ క్రమంలో గుడివాడకు చెందిన కరిష్మా(17) శుక్రవారం ఉదయం కళ్లు తిరిగి పడిపోయింది. ఆమెను వెంటనే విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై అధికారులు ఆరా తీయగా ఫుడ్ పాయిజన్ జరిగిందని నిర్వాహకుడు వెల్లడించాడు. గురువారం రాత్రి ఫుడ్ పాయిజన్ కావడంతో మొత్తం ఎనిమిది మంది వాంతులు చేసుకున్నారని, స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడ్ని తీసుకొచ్చి మందులు ఇప్పించామని నిర్వాహకులు చెబుతున్నారు. కరిష్మా చనిపోయిన తర్వాత ఏడుగురు విద్యార్థినులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వారితో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ సుహాసిని, ఫుడ్ సేఫ్టీ అధికారి గౌస్ మాట్లాడారు. వారు మాత్రం తమకు ఎలాంటి వాంతులు కాలేదని చెప్పారు. ఈ నెల 26న వాంతులు అయినట్టు కొందరు తెలిపారు. వారిని ఆసుపత్రిలో చేర్పించి పరిశీలనలో ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో వైద్యులను ఆదేశించారు. ఫుడ్‌పాయిజన్ అని చెప్పడంతో మదర్సాలో అధికారులు తనిఖీలు చేసి.. ఫ్రిజ్‌లో 100 కిలోల కుళ్లిన మటన్, బీఫ్‌ను గుర్తించారు. ఐస్ గడ్డకట్టిన మాంసాన్ని బయటకు తీయగానే దుర్వాసన వచ్చింది. ఈ మాంసం గురించి ప్రశ్నించగా బక్రీద్ పండుగ సందర్భంగా దాతలు ఇచ్చారని నిర్వాహకులు వివరించారు. కరీష్మా మృతదేహానికి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే గుడివాడ నుంచి ఆమె తల్లిదండ్రులు విజయవాడ ఆసుపత్రికి చేరుకుని తమ కుమార్తెను చంపేశారని ఆరోపించారు. ఆసుపత్రి మార్చురీ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను మదర్సా నుంచి తీసుకెళ్లిపోయారు.

మార్కెట్ యార్డులకు పర్సన్ ఇన్‌చార్జిలు

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు గత ప్రభుత్వంలో నామినేట్ అయిన పాలకవర్గాల రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ పాలకవర్గాల స్థానంలో అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వివిధ జిల్లాల్లో 21 యార్డుల పాలకవర్గాలు రాజీనామా చేయకపోవడంతో వారి పదవుల్ని నిలిపివేసింది. ఆ యార్డులకు కూడా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని మరో ఉత్తర్వులో ప్రభుత్వం స్పష్టం చేసింది.

వ్యాపార కేంద్రంగా తిరుమల శారదామఠం

ఆక్రమణలను కూల్చకపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధం

ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



తిరుమలలో శారదా మఠం నిర్మిస్తున్న ఆరంతస్థుల భవనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసానంద తదితరులు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదామఠంలో ఆక్రమణలను కూల్చపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధమేనని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి హెచ్చరించారు. శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో ఏపీ సాధు పరిషత్ స్వామిజీలు శుక్రవారం తిరుమలకు చేరుకుని శారదామఠంలోని నిర్మాణాలను పరిశీలించారు. ముందు, వెనుకభాగాలతో పాటు బేస్మెంట్‌ను కూడా తనిఖీ చేశారు. అనంతరం శ్రీనివాసానంద సరస్వతి మీడియాతో మాట్లాడారు. శారదా పీఠాధిపతినని చెప్పుకుంటూ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారం మఠంలో నిర్మాణాలు చేపట్టారన్నారు. మఠం వెనుకభాగంలోని 80 అడుగుల కాలవను పూడ్చి 20 అడుగులకు కుదించేశారన్నారు. ఐదు వేల చదరపు అడుగుల వరకు మాత్రమే నిర్మాణాలు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అదనంగా మరో రెండు వేల చదరపు అడుగులు ఆక్రమించి కట్టడాలు నిర్మించారని టీటీడీ అధికారులే చెప్పారన్నారు. ఇందుకోసం వందలాది చెట్లను కూడా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు అంతస్తులే ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ శారదా మఠంలో ఆరు అంతస్తులు కట్టారని.. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకునేందుకు వీలుగా సెట్‌బ్యాక్ కూడా లేకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. టీటీడీ చర్యలు చేపట్టకపోతే హిందూ సమాజంతో కలిసి తాము ముందుకొస్తామని హెచ్చరించారు. శారదామఠంలో ఒక్కరికైనా పిడికెడు అన్నం పెడుతున్నారా, ఏ పూజైనా చేస్తున్నారా అని ప్రశ్నించారు. తిరుమలలో యాగాలు, యజ్ఞాలు చేయమని మఠాలకు స్థలాలిస్తే గదుల ధరలు విపరీతంగా పెంచడంతో పాటు పెళ్లిళ్లు చేయిస్తూ వ్యాపార కేంద్రాలుగా మార్చేశారన్నారు. అధికారులు వచ్చేంత వరకు మౌనదీక్ష చేస్తామని స్వామిజీలు మఠం ముందు బైఠాయించారు. పోలీసులు, విజిలెన్స్ అధికారులు తప్ప ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు రాకపోవడంతో సుమారు రెండు గంటల పాటు మఠం ముందే కూర్చున్నారు. తర్వాత రెవెన్యూ అధికారులు వచ్చి మఠంలో జరిగిన అక్రమ కట్టడాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే దేశంలో ఉన్న సాధువులందరినీ ఏకం చేసి నిరసన వ్యక్తం చేస్తామని స్వామిజీలు హెచ్చరించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ వారి వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.

విద్యార్థుల్లో.. విద్యార్థిగా..!

- పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ సందర్శించిన భువనేశ్వరి
- వసతులపై ఆరా.. విద్యార్థినులతో కలిసి భోజనం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న నారా భువనేశ్వరి

చల్లపల్లి/భట్టిప్రోలు, జూన్ 28: ఎన్నికల సందర్భంగా సేవా కార్యక్రమాలకు కాస్త విరామం ఇచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి.. మరలా ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. తరగతి, హాస్టల్ గదులను సందర్శించి అక్కడున్న వసతులను పరిశీలించారు. భోజనశాలలో పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. అనాధలు, తల్లిదండ్రులను పోగొట్టుకున్న టీడీపీ కార్యకర్తల పిల్లలకు ఇక్కడి స్కూల్‌లో చదువు చెబుతున్నామని తెలిపారు. ఇక్కడ చదివిన భవన్నసాయి అనే విద్యార్థిని ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్టు చెప్పారు. కాగా.. బాపట్ల జిల్లా భట్టిప్రోలులోని హెరిటేజ్ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. హెరిటేజ్ సంస్థకు పాలు పోసే ప్రతి రైతు లబ్ధి పొందడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తుందన్నారు.

భారత్ హిందూ దేశం కాదన్న అమర్త్యసేన్ అభిప్రాయం సరైనదే

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భారత్ హిందూ దేశం కాదని, అందరికీ చెందిన దేశమని ఇటీవలి లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయని పేర్కొన్న నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ అభిప్రాయం సరైనదే అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇదే అంశాన్ని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని పేర్కొన్నారు. భారత్ భిన్నత్వంలో ఏకత్వం గల దేశమని, ఏదో ఒక మతానికి పరిమితమైనదని చెప్పడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. పలు కులాలు, మతాలు, భాషలు, బహుళ సంస్కృతి కలిగిన దేశం మనది అని పేర్కొన్నారు.

చిత్తూరు టు కాకినాడ

గ్రీన్ చానెల్‌లో బియ్యం తరలింపు

- ద్వారంపూడి కుంభకోణానికి అధికారుల పూర్తి సహకారం
- మత్స్యకార కుటుంబాలకు అదనపు సరుకులు
- ఈ కొత్త పథకానికి ప్రతిపాదనలు పంపాలి
- 36,300 కోట్లు అప్పు తెచ్చిన వైసీపీ ప్రభుత్వం
- 10 గోదాములు తనిఖీ చేస్తే ఏడింటిలో అక్రమాలు: మంత్రి మనోహర్



కాకినాడ పోర్టు సమీపంలోని ఓ బియ్యం గోదాములో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ

కాకినాడ(కలెక్టరేట్), జూన్ 28: 'వైసీపీ పాలనలో రాష్ట్రమంతా బియ్యం మాఫియా నడిచింది. చిత్తూరు నుంచి కాకినాడ వరకు గ్రీన్ చానెల్‌లో రేషన్ బియ్యాన్ని తరలించారు. ఆ మొత్తాన్ని కాకినాడ పోర్టు నుంచి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి విదేశాలకు ఎగుమతి చేశారు. ద్వారంపూడి బియ్యం కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారులు పూర్తిగా సహకరించారు' అని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి నాదెండ్ల శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ద్వారంపూడి కుటుంబానికి వైసీపీ పూర్తిగా అండదండలు అందించింది. అక్రమ బియ్యం ఎగుమతులతో కోట్లకు కోట్లు ద్వారంపూడి సంపాదించారు. వైసీపీ ప్రభుత్వంలో కాకినాడ పోర్టు నుంచి ద్వారంపూడి కుటుంబానికి భారీగా లబ్ధి చేకూరింది. వైసీపీ ప్రభుత్వం పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా రూ.36,300 కోట్లు అప్పు తీసుకొచ్చింది. తీరా దిగిపోతూ రైతులకు ఇవ్వాల్సిన రూ.1,600 కోట్లు ఇవ్వలేదు. ఇకనుంచి కొత్త ప్రభుత్వం ద్వారా అక్రమ దందాకు పూర్తిగా చెక్ పెడతాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి రేషన్ లబ్ధిదారుడికి మేలు చేసేలా నిర్ణయాలు ఉంటాయి. ధాన్యం సేకరణలో రైతులకు అన్యాయం జరగకుండా చూస్తాం. తీర ప్రాంతాల్లో మత్స్యకార కుటుంబాలకు అదనపు సరుకులు అందించే కొత్త పథకానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

తనిఖీలతో హడలెత్తించిన మంత్రి

మంత్రి తనిఖీలు ఎక్కడో అధికారులకు చెప్పలేదు. నేరుగా కాకినాడ పోర్టు సమీపంలోని బియ్యం గోదాముల వద్దకు వెళ్లారు. వాటిలో ద్వారంపూడి గోదాములు ఉండడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఉలిక్కిపడ్డారు. వీటిలో కాకినాడ పోర్టు ఏరియాలో ఉన్న విశ్వప్రియ బియ్యం గోదాము, బీచ్‌రోడ్డులోని సాటక్స్ ఇండియా, రవీంద్ర బియ్యం గోదాము, మానస ఎక్స్‌పోర్ట్, డీఎస్ఎన్ బియ్యం గోదాము, కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ బియ్యం గోదాము, తాళ్లరేవు మండలం చొల్లంగిలోని సరళ ఫుడ్స్, యానాం రోడ్డులోని విష్ణు పట్టాభిరామ ఫుడ్స్, ఆగ్రో ఇండస్ట్రీ, చొల్లంగి విశ్వగోదాములు, తూరంగిలోని వీఎస్‌రాజు సన్స్ తదితర బియ్యం గోదాములను అధికారులతో కలిసి బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. నిల్వల్లో తేడాలు పసిగట్టి అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. 'తనిఖీలు నిర్వహించిన 10 ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయి. వారం దరి మీద సెక్షన్ 6 ఏ, లీగల్ మెట్రాలజీ ద్వారా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి మనోహర్ తెలిపారు.

కొత్త వాహనమే మృత్యుశకటమైంది..!

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో
- వాహన పూజ చేయించి వస్తుండగా ఘటన
- ఇద్దరు చిన్నారులు సహా 13 మంది మృతి
- మృతుల్లో అంధ మహిళా ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ మానస
- నలుగురికి తీవ్ర గాయాలు, హావేరి జిల్లా ఆస్పత్రికి తరలింపు





లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన టెంపో, ట్రోఫీతో మానస

బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సహా 13 మంది దుర్మరణం పాలయ్యారు. బెంగళూరు నుంచి పూణె వెళ్లే 48వ జాతీయ రహదారిపై హావేరి జిల్లా బ్యాడగి తాలూకా గుండేనహళ్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెలర్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 11 మంది అక్కడికక్కడే, మరో ఇద్దరు ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా హొళెహొన్నూరు ఎమ్మిగట్టి గ్రామస్తులుగా గుర్తించారు. టెంపో ట్రావెలర్‌లో ప్రయాణిస్తున్న పరశురామ్ (45), భాగ్య (40), నాగేశ్ (50), విశాలాక్షి (50), సుభద్రబాయి (65), పుణ్య (50), మంజులబాయి (57), టెంపో డ్రైవర్ ఆదర్శ (23), మానస (24), రూప (40), మంజుల (50), ఆర్య (4), నందన్ (6) మృతి చెందారు. ఓ వృద్ధురాలు, ఓ యువతి, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హావేరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెలర్ వేగంగా ఢీ కొనడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని జిల్లా ఎస్పీ అంశుకుమార్ తెలిపారు. ఇటీవల కొనుగోలు చేసిన టెంపో ట్రావెలర్ వాహనానికి కలబురగి జిల్లా చించోళి మాయమ్మ గుడిలో పూజలు చేయించి మూడు కుటుంబాలకు చెందిన 17 మంది తిరిగి స్వస్థలానికి వెళుతుండగా ప్రమాదం జరిగిందని అన్నారు. తెల్లవారుజామున రోడ్డు పక్క నిలిపి ఉన్న లారీని గమనించకుండా.. డ్రైవర్ టెంపోను అతివేగంగా నడుపుతూ, నియంత్రించలేకపోవడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. కాగా.. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతులకు ఒక్కొక్కరికీ రెండు లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు.

అంధత్వాన్ని అధిగమించి..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మానస అంధురాలు. ఈ లోపాన్ని అధిగమించి ఆమె ఎన్నో విజయాలు సాధించారు. ఐఏఎస్ కావాలన్న తన జీవిత లక్ష్యాన్ని చేరుకునేందుకు బెంగళూరులో కోచింగ్ తీసుకుంటున్నారు. గుడికి వెళదామని కుటుంబ సభ్యులు పిలవడంతో ఆదివారం స్వగ్రామానికి వచ్చి ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అంధత్వం ఉన్నా అనుకున్నది సాధించాలనే పట్టుదల కలిగిన మానస భారత అంధ మహిళల ఫుట్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ.. పలు ట్రోఫీలు సాధించారు. ఐఏఎస్ కావాలన్న లక్ష్యాన్ని సాధించేలోగా ప్రమాదంలో కన్నుమూశారు.

అమెరికాలో తెలుగోళ్ల హవా

- అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య
- ఎనిమిది సంవత్సరాల్లో నాలుగు రెట్ల పెరుగుదల
- 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు
- ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో.. పదకొండో స్థానంలో నిలిచిన తెలుగు
- అమెరికాకు ఏటా వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 12.5% మనోళ్లే

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యూనివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలుగా ఉండగా.. ఇప్పుడది 12.3 లక్షలకు చేరినట్టు తేలింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారు ఉంటున్నారు. తర్వాతి స్థానాల్లో టెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1 లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78 వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతంగా ఉంటోంది.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ యూనివర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ యూనివర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు చాలా ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల తెలుగు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

.. ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

నాకెందుకు పురుషత్వ పరీక్షలు?

- పోలీసులతో సూరజ్ రేవణ్ణ వాగ్వాదం

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అసహజ లైంగిక దౌర్జన్యం కేసులో అరెస్టయిన ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ.. విచారణలో సీఐడీ అధికారులకు సహకరించడం లేదని సమాచారం. సూరజ్‌పై ఆరోపణలు చేసిన యువకుడికి పురుషత్వ పరీక్షలు నిర్వహించారు. అదే తరహా పరీక్షలు నిర్వహించేందుకు సీఐడీ అధికారులు సూరజ్‌ను శుక్రవారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీనికి సూరజ్ అభ్యంతరం తెలిపారు. పోలీసుల సమక్షంలో ఆయనను వైద్యులు పరీక్షించేందుకు ప్రయత్నించగా, వాగ్వాదానికి దిగారు. తనకెందుకు పురుషత్వ పరీక్షలు చేయిస్తున్నారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను స్వలింగసంపర్కుడిని కాదని, ఎవరో తనపై రాజకీయ కుట్రతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలు లేవని అన్నారు. 'నేను మగాణ్ణని మీకు తెలియదా?' అని ఆయన పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది.

పోక్సో కేసులో యడియూరప్పకు మరో రెండు వారాలు బెయిల్

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు మరో రెండువారాలు ఊరట లభించింది. పోక్సో కేసు రద్దు చేయాలని యడియూరప్ప దాఖలు చేసుకున్న పిటిషన్‌ను శుక్రవారం విచారించిన హైకోర్టు ధర్మాసనం.. రెండు వారాల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో ఆయనపై రెండువారాలపాటు ఎటువంటి చర్యలు తీసుకునేందుకు సీఐడీకి వీలు లేకుండా పోయింది. పోక్సో కేసులో యడియూరప్పపై సీఐడీ పోలీసులు గురువారం చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

సీఎం పదవి లింగాయతలకు ఇవ్వాలి

- శ్రీశైల సూర్య సింహాసన మహాపీఠం స్వామిజీ



పండితారాధ్య శివాచార్య స్వామిజీ

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు జరిగితే వీరశైవ లింగాయత వర్గానికి చెందిన వారికి ఆ పదవి ఇవ్వాలని యడూరులోని శ్రీశైల సూర్య సింహాసన మహాపీఠం అధిపతి డాక్టర్ చిన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్య డిమాండ్ చేశారు. బెళగావి జిల్లా చిక్కోడి పరిధిలోని యడూరు గ్రామంలో శుక్రవారం స్వామిజీ మాట్లాడారు. సీఎం మార్పు జరిగితే వీరశైవలింగాయతలకు ప్రాధాన్యం ఇవ్వాలని పంచపీఠాలు తీర్మానించాయని తెలిపారు. ఎంబీ పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, ఎస్ఎస్ మల్లికార్జున, శ్యామనూరు శివశంకరప్పలాంటివారికి అవకాశం ఇవ్వాలని అన్నారు. ఈ అంశంపై కాశీ, ఉజ్జయిని మఠాధిపతులతోనూ చర్చించినట్లు తెలిపారు. కాగా, కెంపేగౌడ జయంతి వేదికపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమక్షంలోనే విశ్వఒక్కలిగల మఠాధిపతి చంద్రశేఖరస్వామిజీ గురువారం చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్దరామయ్య పదవి నుంచి తప్పుకోవాలని ఆయన సూచించారు. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపింది. ముఖ్యమంత్రి ఎవరనేది తమ పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, స్వామిజీలు కాదని సీఎం సిద్దరామయ్య అక్కడే తిప్పికొట్టారు. చంద్రశేఖరస్వామిజీ వ్యాఖ్యలపై మంత్రి రాజణ్ణ తీవ్రంగా స్పందించారు. 'స్వామిజీ.. పీఠాన్ని వదులుకుని మాకు అవకాశం ఇస్తారా..? నేను కాషాయం ధరిస్తా' అని అన్నారు. అందుకు చంద్రశేఖర స్వామిజీ దీటుగా స్పందిస్తూ, మంత్రి రాజణ్ణ భార్య, పిల్లలు సహా అన్ని వదులుకుని వస్తే తన పీఠం త్యాగం చేస్తానని అన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.33	1,578.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	879	462
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	297	2,698
సామర్థ్యం (టీఎంసీలు)	5.15	3.71

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



మట్టిని తవ్వి సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న దృశ్యం

సిరుగుప్ప, జూన్ 28: రూ.20 లక్షల వ్యయంతో హైస్కూలు మైదానంలో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారి నుంచి ఉర్దూ పాఠశాల వరకు ఈ పనులను నిర్మిత కేంద్రం ఆధ్వర్యంలో జరుగనున్నాయి. నిర్మిత కేంద్రం ఏఈ గోకుల మాట్లాడుతూ సీసీ రోడ్డుతో పాటు ప్రహరీ, ఇతర పనులు కూడా చేస్తామని ఆయన తెలిపారు.

వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

బళ్లారిరూరల్, జూన్ 28: బళ్లారి నగరంలో బళ్లారి వరల్డ్ విజన్ మేనేజర్ ప్రేమలత, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆధ్వర్యంలో గురువారం పేద విద్యార్థులకు 13 సైకిళ్లను పంపిణీ చేశారు. కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు సైకిల్ నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ పదాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనతా బజార్ సభ్యుడిగా శ్రీనివాస్ మోత్కర్



శ్రీనివాస్ మోత్కార్‌ను స్వాగతిస్తున్న నీలకంఠప్ప

బళ్లారి సిటీ,జూన్ 28: నగరంలోని జనతాబజార్ సభ్యుడిగా కార్పొరేషన్ సభ్యుడు శ్రీనివాస్ మోత్కార్ నియమితుడయ్యారు. 10వ వార్డులోని సహకార సంఘంలో సభ్యత్వం ఖాళీగా ఉండడంతో ఆ స్థానంలో శ్రీనివాస్ మోత్కార్‌ను నియమించారు. ఆయనకు జనతా బజార్ అధ్యక్షుడు జి.నీలకంఠప్ప స్వాగతం పలికి అభినందించారు.

ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించాలి



తుమటి లక్ష్మణ్ణ

కంప్లి, జూన్ 28: బళ్లారి జిల్లా పరిధిలోని సండూరు నియోజకవర్గ ఉపఎన్నికలో తనకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంత్రి సంతోష్‌లాడ్, ఎంపీ తుకారామ్ అవకాశం కల్పిస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలబడతానని మాజీ పంచాయతీ సభ్యులు తుమటి లక్ష్మణ్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో సంతోష్‌లాడ్, తుకారామ్‌ల గెలుపుకు తాను ఎంతో కృషి చేశానన్నారు. తాము 2006లో తాలుకా పంచాయతీ, 2011 జిల్లా పంచాయతీకు ఎన్నికయ్యామన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ నాయకుల గెలుపునకు ఎంతో కృషి చేశామన్నారు. అలాగే 2008, 2013, 2017, 2022 వరకు కూడా తాము ఎంపీ అభ్యర్థుల గెలుపునకు సహకరించామని ఈ ఉప ఎన్నికలో తమ నాయకులు సంతోష్‌లాడ్, తుకారామ్‌లు తమకు అవకాశం కల్పించాలని కోరారు. సండూరు నియోజకవర్గంలో 28 గ్రామ పంచాయతీలు, 18 తాలుకా పంచాయతీలు, రెండు పురసభలు, ఒక పట్టణ పంచాయతీ మొత్తం 2.23 లక్షలకు పైగా ఓటర్లు వున్నారని, అన్ని గ్రామాల్లో తాము గుర్తింపు పొందామన్నారు. అప్పట్లో బసాపురం బసప్పతో పాటు తాము కాంగ్రెస్ పార్టీ నాయకుల గెలుపుకు ఎంతో కృషి చేశామని కనుక ఈ ఎన్నికల్లో తమకు అవకాశం కల్పిస్తే గెలుపు ఖచ్చితంగా వుంటుందన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న కరవే జిల్లా అధ్యక్షుడు మునిస్వామి

కల్యాణం.. కమనీయం!

- అమరేశ్వరుడి సాక్షిగా ఒక్కటైన 21 జంటలు

బళ్లారిరూరల్, జూన్28 : బళ్లారి రూరల్ పరిధిలోని సిరివరం అమరేశ్వర దేవస్థానం శుక్రవారం ఒక్కసారిగా కొత్త వెలుగులు సంతరించుకుంది. ఎక్కడచూసినా పెళ్లి కళ కనిపించింది. దేవాలయ ఆవరణలో శుక్రవారం ఉచిత వివాహాలు జరగడమే ఇందుకు కారణం. కన్నడ రక్షణ యువవేదిక జిల్లా అధ్యక్షులు మునిస్వామి ఆధ్వర్యంలో 21 జంటలు ఒక్కటయ్యాయి. ఆయన దాదాపు ఇప్పటివరకు 921 జంటలకు పెళ్లిళ్లు చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు వివాహాలు చేయడం వల్ల పుణ్యం వస్తుందని అందువల్ల ప్రతి ఏడాది ఉచిత వివాహాలు నిర్వహిస్తున్నామన్నారు. గత రెండు రోజులుగా అమరేశ్వరస్వామి దేవాలయంలో ఇందుకోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



కాంగ్రెస్ అవినీతిపై గర్జించిన కమలం

- రూ.187 కోట్ల స్వాహాపై నిరసన
- సీఎం సిద్దూ రాజీనామా చేయాలని డిమాండ్

బళ్లారి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్టీ సంక్షేమ శాఖకు సంబంధించిన బ్యాంకులో నుంచి రూ.187 కోట్లు వివిధ ఖాతాల్లో వేసుకుని అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ గర్జించింది. ఈ అవినీతికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని పట్టుపట్టింది. ఎస్టీ నిగమ మండలికి సంబంధించిన రూ.187 కోట్లు బ్యాంకు ఖాతాలో నుండి వివిధ బినామీ పేర్లతో డ్రాచేయడంపై బీజేపీ శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన బృహత్తర ప్రతిఘటన కార్యక్రమంలో భాగంగా బళ్లారిలో బీజేపీ నాయకులు నిరసన, ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీ నాయకుడు, మాజీ మంత్రి బి. శ్రీరాములు,మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనీల్ నాయుడు, రాష్ట్ర బీజేపీ కమిటీ నాయకులు నేతృత్వంలో బళ్లారిలో ధర్నానిర్వహించారు.

ముందుగా నగరంలోని బీజేపీ నాయకులతో పాటు వివిధ ప్రాంతాల నుండి బీజేపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ సంఘాలవారు దుర్గామాత దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి రాయల్ సర్కిల్ మీదుగా డీసీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. డీ.సీ కార్యాలయానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. అనంతరం అక్కడ బైఠాయించారు. వేలాది మంది బీజేపీ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా కదలివచ్చారు. అవినీతి సీఎం దిగిపోవాలి. ఎస్టీ నిగమ మండలిలో అవినీతికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ శిక్షించాలి అని నినాదాలు చేశారు. మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ.. సీఎం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీజేపీ నేతలు



దుర్గమ్మ దేవాలయం నుంచి ర్యాలీగా వస్తున్న కమల దళం

డీసీ కార్యాలయం ఎదుట ధర్నా

మాజీ మంత్రి బి. శ్రీరాములు, గాలి సోమశే ఖర్ రెడ్డి ఇతర బీజేపీ కార్యకర్తలు డీ.సీ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరవధిక ధర్నాకు పూనుకున్నారు. అక్కడే రాత్రి పొద్దుపోయేదాకా కూర్చున్నారు. పోలీసులు వీరికి ఎంత నచ్చజెప్పినా వినకుండా ధర్నాలో పాల్గొన్నారు.

విచారణను సీబీఐకి అప్పగించాలి

- బీజేపీ రాయచూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివరాజ్ పాటిల్ డిమాండ్
- అవినీతికి వ్యతిరేకంగా భారీ ప్రదర్శన
- అగ్రనాయకుల అరెస్టు

రాయచూరు, జూన్ 28: వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతిపై విచారణ బాధ్యతను సీబీఐకి అప్పగించాలని బీజేపీ రాయచూరు జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటిల్ డిమాండ్ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు చేపట్టిన ధర్నా శుక్రవారం నగరంలో రసాభాసగా మారింది. తొలుత జిల్లాధికారి కార్యాలయం ఎదురుగా ఉన్న టిప్పు సుల్తాన్ గార్డెన్‌లో ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులు.. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. జోక్యం చేసుకున్న పోలీసులు సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటిల్, మాజీ మంత్రి శివనగౌడ నాయక్, మాజీ ఎమ్మెల్సీ శంక్రప్పతోపాటు పలువురు జిల్లాస్థాయి నాయకులను అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా డా.శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ.. వాల్మీకి అభివృద్ధి మండలి చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా పదవిలో కొనసాగడం సరికాదన్నారు.



బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎట్టకేలకు మొసలిని పట్టేశారు..



మొసలిని బంధించిన అధికారులు

కంప్లి, జూన్ 28 : సోమప్ప చెరువులో గత రెండు మూడు రోజులుగా హల్‌చల్ చేస్తున్న మొసలిని ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు బంధించారు. శుక్రవారం ఉదయం అటవీశాఖ అధికారి రామేంద్ర సిబ్బందితో మొసలిని గుర్తించి బంధించారు. ఎంతో మంది పట్టణాల నుంచి ఆ మొసలిని చూసేందుకు తరలివచ్చారు. పట్టుకున్న మొసలిని తుంగభద్ర నదిలో గానీ, జూలో గానీ వదలిపెడతామని అటవీ అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు పురసభ ముఖ్య అధికారి దుర్గన్న, మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు చిన్నరాజప్ప, ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నీరు నిల్వ ఉంచిన డ్రమ్ములను పరిశీలిస్తున్న డాక్టర్ ఈరణ్ణ

సిరుగుప్ప, జూన్ 28: డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ ప్రజలకు తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో డెంగ్యూపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ నీటిని నిల్వ వుంచుకోవడం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. నీటి డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. నగరంలో పర్యటించి ప్రజలకు వ్యాధులు సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్త అమ్మమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారిరూరల్, జూన్ 28 : తాలుకాలోని చేళగుర్కి ఎర్రితాతఆలయంలో శుక్రవారం కగ్గల్‌గ్రామానికి చెందిన తిరుమలేష్ కుమార్తె చంద్రకళ వివాహం అశోక్‌తో జరిగింది. ఈ వేడుకల్లో మాజీ మంత్రి శ్రీరాములు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అక్కడ బీజేపీ కార్యకర్తలను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంటింటికీ డెంగీపై అవగాహన కల్పించాలి: సీఈఓ

బళ్లారి సిటీ, జూన్ 28: ఇంటి చుట్టుప్రక్కల వాతావరణంలో చిన్నపాటి అజాగ్రత్త కూడా డెంగీ జ్వరంతో బాధపడేలా చేస్తుందని జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప సూచించారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను, దోమల లార్వాలను గుర్తించి నాశనం చేయాలన్నారు. ఏడీస్ దోమల నిర్మూలన దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఇందిరానగర్‌లో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహకారంతో నిర్వహించిన డెంగ్యూ నియంత్రణ జాతాలో ఆయన పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

డెంగ్యూ జ్వరం నియంత్రణకు చర్యలు

ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహమ్మారి డెంగీ వ్యాధిని అరికట్టేందుకు ప్రజలు తమ ఇళ్లలోనూ, బయట ప్రాంతాల్లో నీరు చేరకుండా చూసుకోవాలన్నారు. సాధారణంగా పగటి పూట కుట్టే ఈడీస్ దోమకాటు వల్ల డెంగీ జ్వరాలు వ్యాపిస్తాయని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. సామాన్య ప్రజలు ప్రతి 5-6 రోజులకోసారి నిల్వఉన్న వాటర్ ట్యాంక్, డ్రమ్, బ్యారెల్ లాంటి నీరునిల్వ ఉండే శుభ్రం చేసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా డెంగ్యూ కేసులను పూర్తిగా నియంత్రించేందుకు ఆరోగ్యశాఖతో చేతులు కలపాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. జిల్లా కమ్యూనికబుల్ డీసీజ్ కంట్రోల్ అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ఇంటి చుట్టుప్రక్కల ఉన్న ఘన వ్యర్థాలలో పేరుకుపోయిన వర్షపు నీటిలో ఏడీస్ దోమలు ఉత్పత్తి కాకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ జ్వరం ఏడీస్ ఈజిప్టీ దోమ కాటు ద్వారా సంక్రమించే వైరస్ వల్ల వస్తుందన్నారు. తీవ్రజ్వరం విపరీతమైన తలనొప్పి, కళ్ళవెనుక నొప్పి, కండరాలు, కీళ్లలో విపరీతమైన నొప్పులు, వికారం, వాంతులు, రక్తస్రావం, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి డెంగీ జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందాలన్నారు. అనంతరం 'డెంగీ ఆపండి' అనే గోడపత్రికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లాకీటక శాస్త్రవేత్త నందకాడి, వైద్యాధికారి డాక్టర్ నరసింహమూర్తి, జిల్లా ఆరోగ్య విద్యా శాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది. నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశావర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధరలను తగ్గించాలి



కురుగోడులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐఎం నాయకులు

కంప్లి, జూన్ 28: రాష్ట్రంలో ప్రతి నిత్యం ఉపయోగించే డీజిల్, పెట్రోల్, తినుబండారాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐఎం ఆధ్వర్యంలో కురుగోడు పట్టణంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు మనవిపత్రం అందించారు. ఈ సందర్భంగా గాలి బసవరాజు మాట్లాడుతూ గ్యారెంటీ పథకాల పేరుతో ప్రతి నిత్యం డీజిల్, పెట్రోల్, గ్యాస్ సిలెండర్లు, సామాగ్రి ధరలను పెంచుతున్నారన్నారు. వాటితో పాటు అవినీతి కూడా పెరుగుతోందన్నారు. పేరుకు మాత్రం గ్యారెంటీ పథకాలేగాని ప్రతినిత్యం ధరలు మాత్రం పెంచుతున్నారన్నారు. అనంతరం సీపీఐఎం జిల్లా సమితి సభ్యులు శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి ఎక్కువ అయిందని, వాల్మీకి అభివృద్ధి పథకం నిధులు వృథా అయ్యాయన్నారు. అలాగే యుకేజీ, ఎల్‌కేజీ శిక్షణను ప్రాథమిక పాఠశాలకు బదులు అంగన్‌వాడీలోనే ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. వీరితోపాటు కార్యక్రమంలో సోమప్ప, ఊలెప్ప, సుంకప్ప, సుబ్రహ్మణ్యం, అమిన్‌సాబ్, వెంకప్ప, కలుగుడప్ప, రామప్ప, సీపీఐఎం పదాధికారులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

రైతుల నుంచి 213 అర్జీల స్వీకరణ



రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు (కృష్ణగిరి), జూన్ 28: రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవంలో భాగంగా శుక్రవారం 213 అర్జీలను స్వీకరించారు. కృష్ణగిరి జిల్లాలోని రైతు సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతినెలా రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవ సమావేశం నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాటి సమావేశంలో వ్యవసాయానికి సంబంధించిన సాధారణ సమస్యలపై చర్చించారు. అలాగే వ్యవ సాయ శాఖ ద్వారా త్వరలో ప్రవేశపెట్టనున్న ముఖ్యమంత్రి పథకం వివరాలపై వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు వివరణ ఇచ్చారు. కృష్ణగిరిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వ్యవసాయ విస్తరణ కేంద్రాన్ని కృష్ణగిరి కొత్త బస్టాండ్ సమీపాన ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రైతులనుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ వివరించారు. కాగా ఏనుగుల దాడుల నుంచి పంటలను రక్షించే పనులు చేపట్టేవేళ అటవీశాఖకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని ప్రజలను కోరారు. వేపంకుళం గ్రామంలో ఆత్మ ప్రాజెక్టు కింద తమిళనాడు కొబ్బరి పరిశోధనా కేంద్రానికి కృష్ణగిరి, కావేరిపట్టణం రైతులను తీసుకెళ్లి వారికి కొబ్బరిపై శిక్షణ ఇవ్వడం, తిరువారూరుకు రైతులను తీసుకెళ్లడం, రైతుల కోసం విద్యా యాత్రకు మహిళలను తీసుకెళ్లడంపై అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం బర్గూరు, వేపనపల్లి పంచాయతీ యూనియన్లకు చెందిన 20 మంది రైతులకు 80 శాతం రాయితీతో కోడి పిల్లలు, దూడలు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, వ్యవసాయం జాయింట్ డైరెక్టర్ పచ్చయ్యప్పన్, పశుసంవర్ధక శాఖ జేడీ ఇళంగోవన్, అధికారులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల నుంచి రుణ దరఖాస్తుల ఆహ్వానం

హోసూరు (కృష్ణగిరి), జూన్ 28: వెనుకబడిన వర్గాలు, చిరు వ్యాపారస్తులకు తమిళనాడు ఎకనామిక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు చేయనున్నారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకునే వారికి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించరాదని, దరఖాస్తుదారులకు 18 సంవత్సరాలు నిండాలని 60ఏళ్లు మించరాదని అధికారులు తెలిపారు. కుటుంబానికి ఒక వ్యక్తికి మాత్రమే రుణం ఇస్తామని, వ్యక్తిగత రుణ పథకం క్రింద చిన్న వ్యాపారం, సంబంధిత పరిశ్రమలు, హస్తకళలు సాంప్రదాయ పరిశ్రమలకు గరిష్టంగా రూ.15 లక్షల వరకు రుణసహాయం ఇస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, సంబంధిత పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

వైభవంగా కోట మారియమ్మ ఆలయ వార్షికోత్సవం

హోసూరు, జూన్ 28: హోసూరులో వందల ఏళ్ల చరిత్ర కల్గిన స్వయంభు శ్రీ కోట మారియమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రత్యేక యాగ పూజ, 1008 కలశాల స్థాపన చేశారు. పవిత్ర జలంతో కూడిన కలశ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం శివాచార్యులు పవిత్ర జలంతో కూడిన కళశాలను తలపై పెట్టుకుని వేద మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రదక్షిణలు చేసి మూలవిరాట్ మారియమ్మకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కృష్ణగిరి ఎంపీ గోపీనాథ్ స్వయంగా పాల్గొన్నారు. అనంతరం పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక దీపారాధనలు చేశారు. వేలసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.



కలశాలతో అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ గోపీనాథ్

పశుసంపదకు అనుగుణంగానే ఉద్యోగాలు

రాయచూరు, జూన్ 28: రాష్ట్రంలో ఉన్న పశుసంపదకనుగుణంగా వైద్యులు, ఇతర పశసంవర్ధక శాఖ సిబ్బంది నియామకాలను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పశుసంవర్ధక, పట్టు పరిశ్రమల శాఖ మంత్రి వెంకటేశ్ అన్నారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం కలబుర్గి డివిజన్ స్థాయి ప్రగతి పరిశీలన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులకు సంబంధించి అధికారులు ముందుజాగ్రత చర్యలు తీసుకోవాలన్నారు. 21వ పశుగణన కార్యక్రమం త్వరలోనే ప్రారంభించనున్న నేపథ్యంలో కల్యాణ-కర్ణాటక ప్రాంతంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది నియామకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కల్యాణ కర్ణాటక ఏడు జిల్లాలోని 2,539 గ్రామాల్లో పశుసంపదకు సంబంధించి సమగ్ర వివరాలు సేకరించాలని ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనేక చోట్ల ఉన్న పశు వైద్యశాలలు వాటి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని మంత్రి కోరారు. అదే సమయంలో పశువులు లేనిచోట పశు వైద్యశాలలు ఏర్పాటు చేసినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో వాటిని మార్చేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు ఉద్యోగ నియామకాలను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చేపట్టేందుకు అవసరమైన సిబ్బంది వివరాలను ప్రభుత్వానికి వెంటనే సమర్పించాలన్నారు. కాగా సభలో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ అధికారులు కలబుర్గి విభాగంలో 614 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు మంత్రికి వివరించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వెంకటేశ్

క్రీడలతో ఆరోగ్యం మెరుగు

బళ్లారి సిటీ, జూన్ 28: క్రీడలు ఆరోగ్యంగా, చురుకుగా ఉండటానికి ఎంతో ఉపకరిస్తాయని భారత వాలీబాల్‌జట్టు మాజీ ప్రధానకోచ్, పారిస్ ఒలింపిక్స్ 2024 నామినీ అయిన కృష్ణప్ప అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్స్ విభాగం, కర్ణాటక వాలీబాల్ ఇనిస్టిట్యూట్ బెంగళూరు, బళ్లారి విజయనగరం జిల్లా వాలీబాల్ టీం సంయుక్తంగా శుక్రవారం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అంపైర్ల పరీక్ష, కొత్త నిబంధనలపై కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో క్రీడలు మంచి ఆటగాళ్లను తయారు చేస్తాయన్నారు. టోక్యో ఒలింపిక్స్‌తో ప్రారంభమైన వాలీబాల్ ఆకర్షణీయమైన క్రీడ అన్నారు. వాలీబాల్ క్రీడలో అనేక కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయన్నారు. వాటిని క్రీడా విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్శిటీ చాన్సలర్ తిప్పేరుద్ర మాట్లాడుతూ క్రీడాకారులు మంచి దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల మనోబావాలు వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయని తెలిపారు. ఈసందర్భంగా వాలీబాల్ సంఘం క్రిటికల్ బోర్డు కోఆర్డినేటర్లు వెంకటేశ్, నారాయణస్వామి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రవీణ్‌సింగ్, విజయనగరం వాలీబాల్ అసోసియేషన్ సంజయ్, శశిధర్ పాల్గొన్నారు.